

రంజాన్ వేళలు

ఇఫ్తార్-మంగళవారం
సాయంత్రం - 6.29

సహర్- బుధవారం
ఉదయం - 5.10



ఫిర్యాదులను స్వీకరిస్తున్న లింగ్యానాయక్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన 133 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులలో ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్, భూ సర్వే తదితర దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూసమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ రికార్డు చెక్ చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి రిపోర్ట్ పంపించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్‌లో 100 ఫిర్యాదుల స్వీకరణ

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో మొత్తం 100 అర్జీలను స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌వో హరిప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



ఇల్లు.. మాకు

ఎప్పుడిస్తారు?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల్లో కార్యాచరణను సిద్ధం చేశారు. కానీ, పట్టణ ప్రాంతాల్లో మాత్రం చడీచప్పుడు లేదు. గ్రామీణ ప్రాంతాల్లో మండలానికి ఒక పల్లెను పైలెట్‌గా ఎంపిక చేసిన విషయం విదితమే. బల్దియాల్లో మాత్రం ఒక్క వార్డునూ ఎంపిక చేయలేదు. దరఖాస్తులన్నింటినీ ఇప్పటికే అధికారులు సర్వే చేసి పరిశీలించారు. అయినా ఇళ్లు ఎప్పుడిస్తారనేది మాత్రం తేలడం లేదు. దీంతో అర్బన్ ప్రాంతాల్లోని పేదలు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోని 97 వార్డుల్లో 14,263 మంది దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- పల్లెల్లో ఇందిరమ్మ ఇళ్ల కార్యాచరణ షురూ
- బల్దియాల్లో ప్రారంభం కాని ప్రక్రియ
- మరింత ఆలస్యమయ్యేలా పరిస్థితి
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలుకు యోచన

ఆశగా ఎదురుచూస్తున్న పట్టణ పేదలు

తాండూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): దరఖాస్తులన్నింటినీ ఇప్పటికే పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వే సైతం పూర్తి చేశారు. యాప్‌లో వివరాలను నమోదు చేయడం పూర్తయింది. వార్డు సభలలో అర్హుల జాబితాలు చదివి కూడా నెల రోజులు గడిచిపోయింది. అలాగే ఇప్పటికే సూపర్ చెక్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ విషయాన్ని పరిశీలిస్తే మున్సిపాలిటీలలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ ఆలస్యమవుతుందని తెలుస్తోంది.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీ	వార్డులు	దరఖాస్తులు
తాండూరు	36	2,620
వికారాబాద్	34	3,943
కొడంగల్	12	3,900
పరిగి	15	3,800
మొత్తం	97	14,263

కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు

మా ఇళ్ల ఫొటోలు తీసుకుపోయింద్రు, వివరాలు అన్ని చెప్పాం. రెండు నెలలు గడిచి పోయింది. మాకు ఇళ్లు ఎప్పుడు వస్తాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సమాచారం లేదంటూ అర్హులైన వారంతా మున్సిపాలిటీకి వచ్చి అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు ఇల్లు వస్తుందని ఆశిస్తే, ఇంకా ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలోనేనా?

పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి పట్టణ ప్రాంతాలకు 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేసే

మిగతా 8వ పేజీలో...





రూ.46.62 లక్షల

ట్యాక్స్ వసూలు

» జిల్లా రవాణాశాఖ అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖలో ఫిబ్రవరి నెలలో ట్యాక్స్ చెల్లించని 153 వాహనాలను సీజ్ చేసి రూ.46,62,375 జరిమానాను వసూలు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా ట్యాక్స్ చెల్లించని వాహనదారులు ఆన్‌లైన్‌లో లేదా మీ సేవ ద్వారా చెల్లించాలని ఆయన సూచించారు. ట్యాక్స్ చెల్లించని వాహనాల్లో ఎక్కువగా మధ్య, చిన్న తరహా వాహనాలు ఉన్నాయన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ వాహనాన్ని వారి మొబైల్ నెంబర్‌కి లింక్ చేసుకోవాలన్నారు. తద్వారా వాహనానికి సంబంధించిన సమాచారం, ఫిట్‌నెస్, రెన్యూవల్, ట్యాక్స్ పేమెంట్స్ సమాచారం మొబైల్ ద్వారా పొందవచ్చని తెలిపారు.



ఘనంగా మల్లన్న కల్యాణం

- కనులపండువగా అగ్నిగుండాలు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తజనం

7

లక్ష్యం రూ.191 కోట్లు

పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

ఇప్పటి వరకు వసూలైంది 51 శాతమే.. రంగంలోకి ప్రత్యేక బృందాలు

వందశాతం వసూళ్లే లక్ష్యంగా కార్యాచరణ .. మేడ్చల్ జిల్లాలో ఏర్పాట్లు

మేడ్చల్ ప్రతినిధి, మార్చి3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాల్టీలు, గ్రామాల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నెలాఖరుతో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని చేరుకునేందుకు బల్దియాలు, పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్‌కు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక బృందాలు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తున్నారు. ఇంకా 28 రోజులు మాత్రమే గడువు ఉండటంతో పన్నుల వసూళ్లకు అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. సకాలంలో పన్నులు వసూలు కాకుంటే అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వారికి వడ్డీ మినహాయింపు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని 13 మున్సిపాల్టీలతో పాటు 34 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ. 191 కోట్లు. కాగా ఇప్పటి వరకు 51 శాతం వసూలు చేశారు. ఈ నెలాఖరుకు వంద శాతం పన్నుల వసూళ్లు చేసేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేస్తోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా , ఆ తర్వాత చెల్లించిన వారికి 2 శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రైవేటు ఆస్తుల పన్నులు సకాలంలో వసూలు అవుతున్నా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నుల మాత్రం ఏటా పెరిగిపోతున్నాయి. రూ. కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. దీనికితోడు మున్సిపాల్టీలు, గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడాలంటే వంద శాతం పన్ను వసూళ్లు చేయాల్సిందే.



పన్ను చెల్లించలేదని బాలజీనగర్‌లో ఓ ఇంటి డ్రైనేజీని మూసివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇంటిపన్ను చెల్లించలేదని డ్రైనేజీ మూసివేత

ఘట్‌కేసర్: ఇంటిపన్నులు చెల్లించని వారిపై ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇక్కడ రెండు నెలలుగా సిబ్బంది ట్యాక్స్ వసూళ్లపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతీరోజు బిల్ కలెక్టర్లు ఇళ్ల యజమానుల వద్దకు వెళ్లి పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. పలుమార్లు తిరిగినా స్పందించక పోవడంతో మున్సిపల్ సిబ్బంది ముందుగా డ్రైనేజీని బ్లాక్ చేస్తున్నారు, అప్పటికీ స్పందించక పోతే తాగునీటి నల్లా కనెక్షన్‌ను సైతం కట్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో ఆగిన రోడ్డు పనులు



నిలిచిన రోడ్డు పనులు

» 'అంతా మా ఇష్టం!' కథనానికి స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వికారాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'అంతా మా ఇష్టం!.. ప్రభుత్వ భూమిలో ప్రైవేటు రోడ్డు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశారు. కొన్ని రోజులుగా రాత్రి పగలు తేడా లేకుండా కొనసాగుతున్న పనులు నిలిచిపోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని కొత్రేపల్లి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సర్వేనెంబర్ 164 లో మొత్తం ప్రభుత్వ భూమి ఉందని అందులో 15 మంది వరకు లావణి పట్టాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టు ఇస్తూ..

ఇదిలా ఉంటే రెవెన్యూ అధికారులు చేతివాటం వల్లే ఈ పనులు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఓ కింది స్థాయి సిబ్బంది రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని రోడ్డు పనులు చేయిస్తున్నాడని, పై అధికారులకు ఒక రకమైన రిపోర్ట్ అందించి క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చేసినట్లుగా తెలుస్తోంది. అయితే ఇందుకు ఒకరిద్దరూ స్థానిక నాయకులు హైదరాబాద్‌లోని బడా నాయకులకు సహకరిచడం, రైతులకు ఇచ్చిన డబ్బులలోనూ చేతివాటం చూపించడంతో ఈ సమస్య బయటకు వచ్చింది. లేకపోతే రెవెన్యూలోని కింది స్థాయి సిబ్బంది ద్వారా రోడ్డు పనులు పూర్తి చేసే వారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ రోడ్డు కోసం ప్రైవేటు టెండర్ కూడా పూర్తియినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రైవేట్ వెంచర్‌కు వెళ్లేందుకు నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణానికి టెండర్లు ఇవ్వడం ఏమిటో..



సిబ్బందితో మాట్లాడుతున్న ఉమాహారతి

దివ్యాంగులు శిబిరాన్ని వినియోగించుకోవాలి

» అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

వికారాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అవసరమైన కృత్రిమ ఉపకరణాలను పొందేందుకు అర్హత కలిగిన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, యూడీఐడీ, ఆధార్ కార్డు శిబిరానికి తీసుకురావాలని అసిస్టెంట్ కలెక్టర్, మహిళా శిశు సంక్షేమ జిల్లా అధికారిణి ఉమాహారతి సూచించారు. సోమవారం జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీకి స్థానిక ధర్మ విద్యాలయంలో ఎంపిక శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా, శిశు దివ్యాంగుల వృద్ధుల సంక్షేమ శాఖ, సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారన్నారు. 40 శాతం వైకల్యం ఉన్నవారు బ్యాటరీ వీల్ చైర్లు, మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రొఫైల్డ్ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్ వంటి ఉపకరణాలను ఉచితంగా పొందవచ్చన్నారు. మొదటి రోజు 108 మంది దివ్యాంగులు తమ అభ్యర్థనలు సమర్పించగా ఇంకా అర్హులైన వారు మార్చి 4, 5 తేదీల్లో శిబిరంలో పాల్గొనవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, రాములు, అలిమ్కో, ప్రతినిధులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు త్వరగా పరిహారం అందించాలి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): తాండూరు - చించోళి జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరగా పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్‌ను ఆదేశించారు. సోమవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఏమైనా ఇబ్బందులుంటే రీసర్వే చేసి ఫైళ్లను క్లియర్ చేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్న వారికి వెంటనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు వచ్చేవారి దరఖాస్తులను పరిశీలించి సమయానికి అందించేందుకు కృషి చేయాలన్నారు.

ఘట్‌కేసర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 117లోని అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టారనే సమాచారంతో తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ బృందం ఆయా నిర్మాణాలను కూల్చివేశారు. స్థానికంగా భూముల ధరలకు రెక్కలు రావడంతో అసైన్డ్ భూములల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలోనూ ఇక్కడ అక్రమ నిర్మాణలను కూల్చివేశారు. ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేయాలి తప్ప నిర్మాణాలు చేపట్టితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కూల్చివేత కార్యక్రమంలో ఆర్ఐ సాయిరాం, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాల కూల్చివేత

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పని కల్పిస్తాం

యాచారం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ వంద రోజుల పాటు ఉపాధి చూపి ఆదుకుంటామని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చిన్న తూండ్ల, తక్కళ్లపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో హరితహారం నర్సరీలనుసందర్శించారు. మొక్కలు ఎండి పోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



యూరియా విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గురునాథ్‌రెడ్డి

రైతులకు అందుబాటులో
యూరియా విక్రయ కేంద్రం

ఇబ్రహీంపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎరువులు రైతులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో యూరియా విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డిలు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఉప్పరిగూడ ప్యాక్స్ ఆధ్వర్యంలో యూరియా విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లకు యూరియా సరఫరా నిలిపివేసినందునే ప్యాక్స్ ద్వారా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఉప్పరిగూడ సొసైటీ భవనంలో ఎరువుల విక్రయ కేంద్రం నడుస్తోందని.. దీనికి అదనంగా యూరియా కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి విద్యాదరి, ప్యాక్స్ సీఈవో బి.గణేష్, ఏఈవో శ్రవణ్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

క్రీడలపై అభిరుచి పెంచుకోవాలి

కొత్తూర్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల విద్యార్థులు అభిరుచి పెంచుకోవాలని జాతీయ అథ్లెటిక్, ఓఎన్జీసీ అధికారి శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. పీఎంశ్రీ యూత్ క్లబ్‌లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శంకర్‌నాయక్ హాజరై పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఇందుకు స్థానిక పీఈటీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, పుట్టిన గడ్డకు మంచిపేరు తెచ్చిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అంగోర్‌నాయక్, పీఈటీ నవనీత, ఉపాధ్యాయులు రవికుమార్, రాజు, బాలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలాలక్ష్మారెడ్డి

జీవవైవిధ్య పరిరక్షణకు పాటుపడాలి

» సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి

కడ్తాల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న ప్రకృతి, సహజ సంపద, జీవరాశులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే జీవజాతుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్‌లో సోమవారం కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లీలాలక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవవైవిధ్యాన్ని కాపాడుతామని విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి రక్షణతోనే జీవరాసుల మనుగడ సాధ్యమని ఆమె తెలిపారు. వన్యప్రాణుల అవాసాలకు నష్టం కలగకుండా జీవన విధానం కొనసాగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పుడమిని కాపాడుకోకపోతే మానవాళి మనుగడ అసాధ్యమన్నారు. సీజీఆర్ ప్రతినిధులు, విద్యాసంస్థల ఉపాధ్యాయులు వెంకటరమణ, వేణుగోపాల్, కిరణ్మయి, హరీశ్, జ్ఞానేశ్వర్, నాగేశ్, రజనీకాంత్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో దినపత్రిక చదువుతున్న ఎమ్మెల్యే యాదయ్య

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

» చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన సోమవారం శంకర్‌పల్లిలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను పరిశీలించి, దినపత్రికలు చదివారు. ఖాళీగా ఉన్న గ్రంథపాలకుడి పోస్టును భర్తీ చేయనున్నట్లు వివరించారు. పాడైన భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం శామీర్‌పేట సమీపంలోని ఎంపీ ఈటల క్యాంప్ కార్యాలయంలో ఆయనను టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డిమీది బాల్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన డైరీ- 2025 అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్కయ్య, హరినాథ్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, విజయ్, శ్రీధర్‌రావు, గంగరాజు, భూపాల్, రవి, మహేందర్‌రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఆమనగల్లు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీని అరికట్టాలని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మీసాల వంశీ ప్రభుత్వాన్ని కోరారు. హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్న కళాశాలల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం టీఎస్ఎస్‌వో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వంశీ పాల్గొని మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో అనేక కళాశాలల, పాఠశాలల నిర్వాహకులు ఫీజుల కోసం విద్యార్థులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని అన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం విద్యాసంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో టీఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని వంశీ తెలిపారు. నాయకులు జగదీశ్ రెడ్డి, అరవింద్ కుమార్, నర్సింహ, రాహుల్, అనిల్, రేవంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

9 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరు నిందితుల అరెస్ట్.. రిమాండ్

చేవెళ్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీసులు పట్టుకొని వారి నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, డిటెక్టివ్ సీఐ ఉపేందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కేసారం గేట్ సమీప బైపాస్ రోడ్డు వద్ద ఒక కారు, స్కూటర్‌తో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ కన్పించారు. పోలీసులు వారి వద్దకు వెళ్తుండగా ఇద్దరు పారిపోయారు. మరో ఇద్దరిని పోలీసులు పట్టుకొని వారి వాహనాలను తనిఖీ చేశారు. రెండు బ్యాగుల్లో 9కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన వారు గోబెరు వెంకటచైతన్య అలియాస్ షేక్ రిజ్వాన్, కురెల్లా సాయిఅరుణ్‌లను స్టేషన్‌కు తరలించారు. షేక్ అబ్బాస్, గణేశ్ పారిపోయారు. నిందితులను విచారించగా గంజాయిని మియాపూర్‌నకు చెందిన శ్రీకాంత్‌యాదవ్, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన సేనల నుంచి తెచ్చి చేవెళ్లకు వచ్చినట్లు చెప్పారు. గంజాయిని, ఇద్దరు నిందితులు, కారు(టీఎస్07 యూఎల్7010), హోండా యాక్టీవా(టీఎస్07 జీటీ5042), పది వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు వేయింగ్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పరారైన ఇద్దరిని పట్టుకునేందు గాలిస్తున్నామన్నారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా నిందితులకు గతంలోనూ నేరచరిత్ర ఉందని చెప్పారు. గోబెరు వెంకటచైతన్య అలియాస్ షేక్ రిజ్వాన్(34)పై రాజమండ్రి, తూర్పుగోదావరి, చేవెళ్ల, మేడ్చల్ తదితర పోలీస్‌స్టేషన్‌ల్లో కేసులు ఉన్నాయన్నారు. ఉప్పల్ ప్రాంతానికి చెందిన కురెల్లా సాయి అరుణ్(25) వృత్తి కారు డ్రైవింగ్. ఇతడిపై మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉందని పోలీసులు తెలిపారు.

పనులు చేసినా.. బిల్లులు రాక!

'మన ఊరు-మన బడి' కింద ప్రాథమిక పాఠశాల నిర్మాణం

- ప్రారంభించి ఏడాది గడుస్తున్నా విడుదల కాని బిల్లులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): టెండర్ వేసినా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తానే ముందుకు వచ్చి రూ.48లక్షలతో నూతన పాఠశాల భవనం నిర్మించాడు ఓ సర్పంచ్. తీరా చేసిన పనులకు బిల్లులు రాక ఎదురు చూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. కేశంపేట మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కూల్చివేసి అదే స్థానంలో నూతనంగా పాఠశాల భవనం నిర్మించడానికి మనఊరు మనబడి పథకం కింద ఎంపిక చేశారు. ఇందుకు టెండర్లు పిలువగా కనీసం ఒక్కరు కూడా ముందుకు రాలేదు. దాదాపు ఎనిమిది సార్లు టెండర్లు పిలిచారు. అయితే, నాడు కేశంపేట సర్పంచ్‌గా ఉన్న తలసాని వెంకట్‌రెడ్డితో అధికారులు టెండర్ వేయించారు. ఆ సమయంలో ఎవరూ కూడా టెండర్ వేయకపోవడంతో వెంకట్‌రెడ్డికి పనులు మొదలు పెట్టి దాదాపు రూ.48 లక్షలు ఖర్చుచేసి నాలుగు గదులతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించారు. రంగులు వేసి, విద్యుత్ సౌకర్యం కూడా కల్పించారు. తరగతి గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు, బ్లాక్‌బోర్డులను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత శాఖ ఏఈ ఎంబీ రికార్డు చేసి బిల్లుకోసం ఉన్నతాధికారులకు పంపించారు. అయితే, భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో 2024 జనవరి 5న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాల భవనాన్ని ప్రారంభించి ఏడాది గడుస్తున్నా బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ లబోదిబోమంటున్నాడు. పనుల కోసం చేసిన అప్పులకు మిత్తి మీద పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



కేశంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మిత్తీలు కట్టలేకపోతున్నా



మా గ్రామంలో పాఠశాల భవనం కట్టడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో నాటి అధికారుల సూచనతో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం చేశాను. దాదాపు రూ. 48లక్షలు విడుతల వారిగా ఖర్చు చేసి జనవరి 2024 వరకు పాఠశాల భవనం పూర్తి చేశాను. ఇందుకు ఏఈ ఎంబీ రికార్డు చేశారు. ఎంబీ రికార్డు చేసి ఏడాది గడుస్తున్న నేటికి ఒక్కపైసా కూడ రాలేదు. పాఠశాల భవన నిర్మాణం కోసం అప్పు చేశా.. ఇప్పుడు అప్పులకు మిత్తి కట్టలేక పోతున్నా, ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి.

- తలసాని వెంకట్‌రెడ్డి, కాంట్రాక్టర్, కేశంపేట



ఘట్‌కేసర్‌లో సంతకాలు సేకరిస్తున్న దివ్యాంగులు

దివ్యాంగులకు ప్రత్యేక చట్టం తేవాలి

ఘట్‌కేసర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ప్రతి మండలం నుంచి ఇద్దరు ప్రజాప్రతినిధుల చొప్పున నామినేట్ చేసేవిధంగా ప్రత్యేక చట్టం తీసుకురావాలని దివ్యాంగుల హక్కుల వేదిక(ఎన్పీఆర్డీ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఘట్‌కేసర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 12.02 శాతం మంది దివ్యాంగులు ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు పాలనపరమైన అనుభవం ఏర్పడితే తమ సమస్యలు పరిష్కరించుకునే వీలుంటుందనానరు. కార్యక్రమంలో నీరజ్‌రెడ్డి, నాగయ్య, పరమేశ్వర్, మాణిక్యం, లక్ష్మయ్య, సత్యానారాయణ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని
విద్యార్థి ఆత్మహత్య

మేడ్చల్ ప్రతినిధి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మేడ్చల్ జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కండ్లకోయ గ్రామానికి చెందిన గుండ్ల కిరణ్‌కుమార్(19) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వారి కుటుంబం నిజామాబాద్ జిల్లా భైంసా నుంచి వచ్చి 20 సంవత్సరాలుగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో నివాసముంటున్నారు. కాగా, కిరణ్‌కుమార్ డిగ్రీ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడన్న అనుమానంతో కుటుంబ సభ్యులు అతన్ని మందలించారు. దీంతో శనివారం కళాశాలకు వెళ్లిన కిరణ్ తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కిరణ్ ఫోన్ జీపీఎస్ ఆధారంగా ట్రాక్ చేయగా ఆదివారం కండ్లకోయ సమీపంలోని సబ్‌స్టేషన్ వెనుకాన ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కిరణ్‌కుమార్(ఫైల్)

క్షణికావేశంలో మరో యువకుడు..

రోడ్డు ప్రమాద విషయం తల్లిదండ్రులకు తెలిస్తే మందలిస్తారేమోనని క్షణికావేశంలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌గడిమలక్‌పేట్ గ్రామానికి చెందిన రాగుల రమేశ్ కొడుకు రాగుల నాగరాజు(21) తండ్రి సెంట్రింగ్ పని చేస్తున్నాడు. నాగరాజు చదువు మధ్యలోనే ఆపేసి తండ్రికి తోడుగా సెంట్రిగ్ పని వెళ్తున్నాడు. సోమవారం స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన నాగరాజు స్నేహితుడి బైక్‌పై ఇంటికి వచ్చాడు. ఇంట్లో నుంచి చీరను తీసుకెళ్లి మల్లన్న గుడి వద్ద చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లిన సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారుకు రోడ్డు ప్రమాదం జరిగిందని, దీంతో జరిగిన వాగ్వాదంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబీకులు భావిస్తున్నారు. జీనోమ్ వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నాగరాజు (ఫైల్)



కళాశాలలో స్పోర్ట్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొని గుర్తింపు పొందాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవరం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్కృష్ట ఇంటర్ కాలజ్ స్పోర్ట్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువు ఎంత ముఖ్యమో ఆటలు, పాటలు అంతే ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయటానికి కళాశాలల యాజమాన్యాలు ఆటల పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలనానరు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం పాల్గొన్నారు.



శామీర్‌పేటలోని శ్రీమల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న యాదవ సంఘం నాయకులు

ఘనంగా మల్లన్న కల్యాణం

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని శ్రీమల్లికార్జునస్వామి జాతర, కల్యాణోత్సవాన్ని సోమవారం యాదవసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని సోమవారం భక్తులు, వివిధ పార్టీల నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం అగ్ని గుండాలు తొక్కి స్వామివారికి పూజలు చేశరు. ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనిత, బీఆర్ఎస్ నాయకులు, దర్శించుకున్నారు.



మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా
అధ్యక్షుడిగా వెంకటయ్య

దుద్యాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): యాదవ హక్కుల పోరాట సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా దుద్యాల మండలంలోని పోలెపల్లి గ్రామానికి చెందిన పుర్ర వెంకటయ్యయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములు నివాసంలో జిల్లా అధ్యక్షుడిగా వెంకటయ్య యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ మాజీ కార్పొరేటర్ జంగయ్యయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్‌యాదవ్, మల్లేశ్ యాదవ్, వీరేందర్‌యాదవ్, అంజియాదవ్ పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న జిల్లా అధ్యక్షుడు పుర్ర వెంకటయ్య యాదవ్



గుంతవద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పెద్దేముల్ యువకులు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

రోడ్డు గుంతలు పూడ్చాలని పెద్దేముల్ వాసుల నిరసన

పెద్దేముల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఏర్పడిన గుంతలతో జనాల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆర్ అండ్‌బీ రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలంటూ పెద్దేముల్ గ్రామస్తులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. పెద్దేముల్ మండల కేంద్రం సమీపంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు కాల్వపై పెద్ద గుంత ఏర్పడింది. గతంలో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కొద్దిరోజుల క్రితం ఓ వ్యక్తి బైక్‌పై అదుపుతప్పి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం ఇక్కడే మళ్లీ గుంతను తప్పించబోయి రెండు బైకులు ఢీకొట్టుకున్నాయి. దీంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్దేముల్ గ్రామానికి చెందిన యువకులు అక్కడికి చేరుకొని నిరసన తెలిపారు. తాండూరు-సంగారెడ్డి ప్రధానరోడ్డు కావడం వల్ల ఈరోడ్డుపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే గుంతలకు మరమ్మతులు చేయాలని కోరారు. మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రాయితీ



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటయ్య

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) అనధికార లేఅవుట్‌లో ప్లాట్లుకొన్న వారు ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద రెగ్యులరైజ్ చేసుకోవాలని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కోరారు. అనధికారిక లేఅవుట్‌లో ప్లాట్లు కొన్న యజమానులు 2020 మార్చి 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలి

పరిగి: అక్రమ లే అవుట్లలోని ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకోవాలని పరిగి మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. మున్సపల్ కార్యాలయంలో సోమవారం లైసెన్స్ టౌన్‌ప్లానర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారికి 25 శాతం రాయితీతో రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో లైసెన్స్ టౌన్‌ప్లానర్స్ కూడా శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లాన్ అధికారులు దశరథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీలో..

ఘట్‌కేసర్: ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం రాయితీ కల్పించినట్లు పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో(విలీన గ్రామాలతో కలుపుకొని) 17,010 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మేనేజర్ నిర్మల, కిరణ్, సాయిరాజ్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో..

మేడ్చల్ ప్రతినిధి, లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్లు భాస్కర్‌రెడ్డి, నాగమణి సోమవారం ప్రకటనలో తెలిపారు. అనధికార లేఅవుట్‌లో కొనుగోలు చేసిన ప్లాట్ల క్రమబద్ధీకరణలో భాగంగా 2020లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఈ అవకాశం ఈ నెల 31 వరకు కల్పించినట్లు చెప్పారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

తూంకుంటలో..

మేడ్చల్ ప్రతినిధి, తూంకుంట మున్సిపల్ పరిధిలో హెచ్‌ఎండీఏ అనుమతి లేకుండా చేసిన ప్లాట్లకు, లేఅవుట్లకు 25 శాతం తగ్గించి క్రమబద్ధీకరించేందుకు ఈ నెల 31 లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్, కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి



జైసింగ్(ఫైల్)

పెద్దేముల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): బైక్ పైనుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం బాయిమీదితండాకు చెందిన జైసింగ్(22) పాషాపూర్ గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకురావడానికి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. పాషాపూర్ సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతడు బైక్‌పై నుంచి తనకు తానుగా పడిపోయాడా.. లేదా ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా? తెలియడం లేదని దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి చాందీబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..



అనూరాధ(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, మార్చి3(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు గ్రామానికి చెందిన ఎదుగని శ్రీనివాస్, అనూరాధ(52) భార్యభర్తలు. వీరికి కుమార్తె మానస, కుమారుడు పూర్ణచందర్ ఉండగా ఐదేళ్ల క్రితం కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తర్వాత శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. అనురాధ క్యాటరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకొన్న శ్రీనివాస్ నిత్యం గొడవ పడుతుండేవాడు. గత నెల 28న భార్యతో గొడవపడి కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరుసటి రోజు ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని ఎదులాబాద్‌లోని ఇంటికి తరలించగా భర్త శ్రీనివాస్, కూతురు మానస వెంట రాలేదు. అనుమానించిన అనూరాధ సోదరుడు కాలేరు నర్సింగ్ రావు ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు, ఫర్నిచర్ చిందరవందర పడి ఉండటంతో శ్రీనివాసే గొడవ చేసి గాయపరిచినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మాకు రుణమాఫీ కాలేదు

ధారూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): మాకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా అందలేదని మండల పరిధిలోని కేరెల్లి రైతులు సోమవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో మొరపెట్టుకున్నారు. రుణమాఫీ చేయాలని, రైతు భరోసా అందించాలని వినతిపత్రం అందజేశారు.

ప్రశాంత వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. సోమవారం కీసర పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో రంజాన్ పండుగ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో రంజాన్ పర్వ దినాలను జరుపుకోవాలన్నారు. వదంతులు నమ్మవద్దని సూచించారు. సమావేశంలో ఎస్సైలు నాగరాజు, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అసైన్డ్‌పై ఆగని రగడ

యాలాల, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూమిలో ఫెన్సింగ్ వేసిన ఘటనతో మూడు రోజులుగా అధికారులకు, యజమానికి మధ్య రగడ కొనసాగుతుంది. ప్రభుత్వం ఎప్పుడైనా భూమిని తీసుకోవచ్చని అధికారులు చెబుతుండగా, ఆ భూమి 50 ఏళ్ల క్రితమే ప్రభుత్వం తమకు ఇచ్చిందని రైతు వాపోతున్నారు. మండల పరిధిలోని కోకట్ పరిధిలోని సర్వే నంబర్-64లో 50 ఏళ్ల క్రితం కోకట్‌కు చెందిన ఉమర్ సాబ్‌కు ప్రభుత్వం ఎకరం ఇచ్చింది. ఆయన మృతి చెందిన తర్వాత ఆయన భార్య మైమూదబేగం మీద పట్టా మార్పిడి జరిగింది. నెల రోజులుగా మైమూదాబేగం ఆ భూమిలో సిమెంటు రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంది. దీనిపై కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో యాలాల తహసీల్దార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెన్సింగ్‌ను నాలుగు రోజుల్లో తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు

కులకచర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 10 వరకు అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ జ్యోతి సోమవారం తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రవేశ రుసుము రూ.125, ఇతరులు రూ.200 చెల్లించాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందని తెలిపారు.

హెచ్‌ఐవీపై అపోహలొద్దు

కులకచర్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై అపోహలు వీడాలని పరిగి ఐసీడీసీ శోభారాణి సూచించారు. సోమవారం కులకచర్లలో వైఆర్‌జీకేర్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన నిర్వహించారు. వంద మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఆర్‌జీకేర్ సంస్థ వికారాబాద్ జోనల్ సూపర్‌వైజర్ రాములు, లింక్ వర్కర్లు రామచంద్రయ్య, సుధ, రాములమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కులకచర్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. సోమవారం కులకచర్ల వివేకానంద కళాశాలలో వికారాబాద్ మహవీర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి 360 మందికి వైద్య చికిత్సలు అందించారు. తహసీల్దార్ మురళీధర్, ఎస్సై అన్వేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు వెంకటయ్యగౌడ్, జానకీరామ్, మహిపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ఉన్నారు.

రూ.80 కోట్లతో ఆలయాల అభివృద్ధి



పరిగి వేంకటేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి రూ.80 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. కమిటీ చైర్మన్‌గా సిద్ధాంతి పార్థసారధి, సభ్యులుగా గోపాల్, సురేఖారెడ్డి, అలూరి నర్సింహులు, పాండ్యలను దేవాదాయ శాఖ అధికారులు మధు, శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల పరిగిలోని వేంకటేశ్వర ఆలయం, వేణుగోపాలస్వామి, కులకచర్ల పాంబండ రామలింగేశ్వర ఆలయాల అభివృద్ధితోపాటు, పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిధుల గురించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గతేడాది నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 9, 10, 11 తేదీల్లో పరిగి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఉంటాయని, భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైఎస్ చైర్మన్ ఆయూబ్, కులకచర్ల చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్ కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్, పరిగి పట్టణ అధ్యక్షుడు కృష్ణ, దోమ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాలది శ్రీనివాస్, చిన్న నర్సింహులు, అశోక్, రమేశ్‌రెడ్డి, శ్రీనివాసపవార్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

దోమ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ ఎస్సీ కాలనీలో వారం నుంచి తాగు నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోయారు. పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోకపోవడంతో సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఉన్న సింగిల్ ఫేజ్ మోటర్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పొలాలకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని వాపోయారు. అధికారులు గుర్తించి తాగునీటించి అందించాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో ప్రగతిపథంలో గ్రామాలు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్

చౌడాపూర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చొరవతో గ్రామాలు ప్రగతిపథంలో దూసుకెళ్తున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలంలోని విఠలాపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీడీవో సోమలింగంతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ షరీఫ్, ఖాజా, బుచ్చయ్య, యాదయ్య, శరత్‌కుమార్, రహీం, మణికంఠ పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన సంగయ్యగౌడ్ నాలుగు రోజులుగా అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సంగయ్యగౌడ్‌కు చికిత్స నిమిత్తం రూ.90వేలు ఖర్చు అవుతుందని ప్రతిపాదించారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.90వేల విలువగల ఎల్వోసీని అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉత్తంచంద్, హరీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఇల్లు.. మాకు ఎప్పుడిస్తరు?

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉంది. మార్చి నెలంతా బడ్జెట్ సమావేశాలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. కాగా, నియోజకవర్గానికి 3,500 ఇళ్ల ప్రతీ యేడాది మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

వేధిస్తున్న స్థలాల సమస్య

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పట్టణాల్లో స్థలాల కొరత వేధిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో అద్దెకు ఉంటూ సమీపంలోని పంచాయతీ పరిధిలో ప్లాట్లు ఉండడం ఉమ్మడి కుటుంబాల్లో ప్లాట్లు ఉండడం వంటి సమస్యలున్నాయి. స్థలం ఉన్న వారికే మొదటి విడతలో ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం చెప్పిన విషయం తెలిసిందే. పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్లను ఎల్ -1, ఎల్ -2, ఎల్ -3లుగా విభజించనున్నట్లు సమాచారం. స్థలమున్న లబ్ధిదారులను ఎల్ -1 కింద, స్థలం లేకుండా అర్హులైన వారిని ఎల్ -2 కింద, అర్హులై ఉండి ఈ రెండింటిలో చోటు దక్కని వారిని ఎల్ -3 కింద ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి జనరల్ లబ్ధిదారులకు రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీ ఆదివాసిలకు రూ.6లక్షలుగా ఇవ్వాలని నిర్ధారించారు.

పీఎం ఆవాస్ యోజనకు లింక్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం గృహ నిర్మాణానికి పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేస్తోంది. ఈ పథకాన్ని రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లింకు చేయనున్నట్లు సమాచారం. ఈ ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని నిర్ణయించారు. కేంద్ర పథకం ద్వారా అర్బన్‌లో రూ. 2.67 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 75 వేల నుంచి రూ. 1.30 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతోంది. ఈ పథకాన్ని లింకు చేసి మిగతా డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేసే యోచనలో ఉంది.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



సంతోష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

పెద్దేముల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజీపూర్‌లో స్వయంభుగా వెలసిన చెన్నకేశవ స్వామి ఆలయం శిథిలమవడంతో పునర్‌నిర్మాణానికి దాతల సాయం కోరారు. తాండూరు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రొంపల్లి సంతోష్‌కుమార్ గర్భగుడి నిర్మాణానికి అవసరమైన గ్రానైట్, టైల్స్ వంటి రూ.లక్షా యాభై వేల సామగ్రిని అందజేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆయనను గ్రామస్తులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, లాల్‌రెడ్డి, సాయిలుగౌడ్, మహిపాల్‌రెడ్డి, తడకల శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అవుసుల రవి, వడ్ల వీరేందర్‌చారి, నాగార్జునరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బిచ్చన్న, సంగమేశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ

వికారాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో గిరిజన బాల బాలికలకు 2025- 26 విద్యా సంవత్సరానికి వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్ రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. బోయినపల్లిలోని క్రీడా పాఠశాలలో కాయకింగ్, కేనోయింగ్, ఫెన్సింగ్ వంటి క్రీడల్లో శిక్షణ ఉంటుందని పేర్కొనానరు. 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మొత్తం 30 మంది విద్యార్థులను ఎంపిక చేసేందుకు శారీరక పరీక్షలు నిర్వహిస్తారని, అర్హత సాధించిన విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశం కల్పిస్తారని, ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, క్రీడా దుస్తులు, షూస్, తదిత సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో మార్చి 9 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 86393 88553 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటయ్యగౌడ్

తాండూరు రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని మండల విద్యాధికారి వెంకటయ్య హెచ్చరించారు. సోమవారం మండలంలోని కరన్‌కోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మిక తనిఖీ చేశారు. గతనెల 28న తొమ్మిది మంది ఉపాధ్యాయుల్లో ఒకేసారి ఐదుగురు సెలవుపై వెళ్లడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం 212 మంది విద్యార్థులకు 162 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఆరోజు సైన్స్ డే కూడా నిర్వహించలేదని,, దీంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడు రమేష్‌తో చర్చించినట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన



దోర్నాల్‌లో క్షేత్ర ప్రదర్శనలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ధారూరు, మార్చి3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోర్నాల్ గ్రామంలో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్, వ్యవసాయ శాస్త్రవేత్త యమున, ఏఈవో సంజూరాథోడ్ విద్యార్థులతో కలిసి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సాగులో ఉన్న వివిధ రకాల పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటల సాగు విధానం, సాగుకు పాటిస్తున్న మెలకువల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలో సర్వే చేసి సామాజిక చిత్రపటాన్ని గీసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సిద్ధార్థ్, కార్తీక్, రఫీ, రియాజ్ పాల్గొన్నారు.

యాలాలలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని తాండూరు ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, జిల్లా కోఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్, బాబా, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీనివాస్, కాసీం, మాజీ ఎంపీటీసీ రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారుతి, అశోక్, మైనుద్దీన్, అంబిక పాల్గొన్నారు.

దారి లేక ఇబ్బందులు పడుతున్నాం



పొలాలకు వెళ్లేందుకు నక్షబాట మ్యాప్‌ను చూపిస్తున్న రైతులు

మోమిన్‌పేట్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దారి మూసి భవన నిర్మాణాలు చేపట్టడంతో పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. మండలంలోని చీమలదరి, చక్రంపల్లి గ్రామాల పరిధిలోని సర్వే నెం.223, 224, 231 పట్టా భూముల్లో నుంచి చక్రంపల్లి, దేవరంపల్లితోపాటు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం కోనాపూరానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లేందుకు నక్షబాట ఉందని తెలిపారు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నక్షబాట గల సర్వే నంబర్‌లోని భూములను కొనుగోలు చేశాడని, నక్షబాటను మూసివేసి భవనాలు నిర్మించారని తెలిపారు. పొలాలకు వెళ్లేందుకు ఉన్న దారిని మూసేసి కట్టడాలు నిర్మిస్తే ఎలా వెళ్లాలని రైతులు వాపోయారు. ఏళ్లు గడుస్తున్నా దారి వదలడం లేదని, ఆ పక్కనే మరో భూమిలో సోమవారం ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయిస్తుంగా రైతులు అడ్డుకున్నారు. పొలాలకు వెళ్లేందుకు దారి చూపించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌యాదవ్

మర్పల్లి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్‌యాదవ్ అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను పార్టీ నాయకులు ఉప్పరి నాగేశ్, మధు, రామేశ్వర్, దివాకర్, నర్సింహులుయాదవ్, శేఖర్‌యాదవ్, రవీందర్‌రెడ్డి, సర్వేశ్, రతన్, మాజీ సర్పంచ్ పాండునాయక్‌తో కలిసి ప్రారంభించారు. గత ప్రభుత్వం గ్రామాల్లో ఉన్న సీసీ రోడ్లను తవ్వి అలాగే వదిలేసిందని ఆరోపించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



దాస్యానాయక్ తండాలో భూమిపూజ చేస్తున్న నాయకులు

కులకచర్ల, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంతో తండాల రూపురేఖలు మారుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని దాస్యానాయక్ తండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ తండాకు సీసీ రోడ్డు మంజూరైందన్నారు. ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 3(ఆంధ్రజ్యోతి) సాంకేతిక రంగంలో రాణించాలనుకుంటున్న బీటెక్ విద్యార్థులు కష్టపడి చదవాలని మల్లారెడ్డి విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. సోమవారం గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో ఫ్యూచర్ సాస్త్ర- 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంకేతిక రంగం అభివృద్ధి, అప్‌డేట్‌లపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక రంగంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. కార్యక్రమంలో డీబీఎస్ టెక్నాలజీ వైస్‌ప్రెసిడెంట్ శాంతమోన భరత్‌వాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.